ఈనాడు బిజినెస్

# వెండి.. షష్టిపూర్తి



## పెట్టుబడికి ఇప్పటికీ అనుకూలమే

డాక్టర్ ఆర్.ఎం.సి.వి. ప్రసాదరావు

వెండి ధర అనూహ్య రీతిలో పెరగడానికి అంతర్జాతీయ పరిణామాలే ప్రధాన కారణం. ప్రస్తుత సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటే వెండికి గిరాకీ సమీప భవిష్యత్తుల్లో తగ్గేటట్లు కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు స్వల్పంగా తగ్గినా.. పెరిగేందుకే అవకాశాలున్నాయి. దీర్ఘకాలిక మదుపర్లు ప్రస్తుత ధరల వద్దా వెండిపై పెట్టుబడికి ఏమాత్రం వెనకాడాల్సిన అవసరం లేదు.

చైనా, ఐరోపాల్లో వడ్డీరేట్లు గణనీయంగా పెరుగుతున్నాయి. అధిక ద్రవ్యోల్బణం దీనికి ప్రధాన కారణం. ఇటువంటి పరిస్థితుల్లో తమ సంపద విలువను కాపాడుకోవడానికి మదుపుదార్లు బంగారం, వెండి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే బంగారంతో పోలిస్తే, వెండికి అధిక గిరాకీ ఏర్పడటానికి ప్రత్యేక కారణాలున్నాయి. వెండి పారిశ్రామిక లోహం కూడా. పరిశ్రమల్లో వెండి వినియోగం ఇటీవల బాగా పెరిగింది. ముఖ్యంగా చైనాలో వెండి వినియోగం ఎక్కువవుతోంది. దానికి తగ్గట్లుగా వెండి ఉత్పత్తి పెరగడం లేదు. 2008లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. ఇంకా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. పైగా మార్కెట్లలో ఒడుదొడుకులు బాగా పెరిగాయి. అందువల్ల మదుపుదార్లు ప్రత్యామ్నాయంగా వెండి, బంగారంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే వీటిపై ఇటీవల ప్రతిఫలం కూడా పెరిగింది. ఇది కూడా వెండిపై మదుపర్ల మోజు పెరగటానికి తావిస్తోంది. మరో పక్క ధర పెరుగుతున్న నేపథ్యంలో బులియన్ వర్తకులు రిస్కును తట్టుకోవడానికి (హెడ్జింగ్) ఫ్యూచర్స్ మార్కెట్లో వెండి, బంగారం ఫ్యూచర్లు బాగా కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కాలంగా వెండి ధర తీరుతెన్నులను గమనిస్తే, ఎప్పటికప్పుడు కొద్దిగా తగ్గి మళ్లీ వెంటనే రెట్టించిన వేగంతో పెరుగుతూ వస్తోంది. ఇదే పరిస్థితి మున్ముందు కూడా కొనసాగుతుందనిపిస్తోంది. అందువల్ల మదుపర్లు దీర్ఘకాలానికి అయితే ధర పెరిగిందని అనుకోకుండా వెండిపై పెట్టుబడి పెట్టవచ్చు. ఇతర సాధనాల్లో పెట్టుబడి పెట్టేవారు అయితే తమ సొమ్ములో 25 శాతం వరకైనా వెండి, బంగారంపై పెట్టుబడి పెట్టే అంశాన్ని పరిశీలించవచ్చు.

**(ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్ మేనేజింగ్ డైరెక్టర్)**

హైదరాబాద్ - న్యూస్‌టుడే

- ముంబయిలో కిలో రూ.60,125
- పారిశ్రామిక గిరాకీతో పెరుగుతున్న ధర
- సువర్ణం సైతం భగభగ..

వేసవి ఎండ కంటే వెండి ధర ఎక్కువగా మంట పెడుతోంది. శుక్రవారం దేశీయ మార్కెట్లో కిలో వెండి (0.999 గ్రేడ్ స్వచ్ఛత) రికార్డు స్థాయిలో రూ.60,125 పలికింది. క్రితం రోజు ముగింపు ధర కన్నా ఇది రూ.1,045 అధికం కావడం గమనార్హం. వెండి ధర రూ.60,000ను అధిగమించడం ఇదే మొదటిసారి. అంతే కాదు, గత 31 ఏళ్ల రికార్డు స్థాయి ధర కూడా ఇదేనని బొంబే బులియన్ అసోసియేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఓపక్క బంగారం ధర సైతం ఎగస్తున్నప్పటికీ, దానితో పోల్చి చూస్తే వెండి ధర పెరుగుదల అధికంగా ఉండటం గమనార్హం. మరో వైపు కమొడిటీ ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ వెండి ధర చురుక్కుమనిపిస్తోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజి (ఎంసీఎక్స్)లో వెండి ఈ ఏడాది డిసెంబరు కాంట్రాక్టు ధర రూ.416 పెరిగి, రూ.60,863 పలికింది. మే నెల కాంట్రాక్టు అయితే రూ.58,325గా ఉంది. ఈ ధరలో రెండు కాంట్రాక్టులు ట్రేడ్ అయ్యాయి.

**బంగారం పది గ్రా. రూ.21,190:** బంగారం ధర గరిష్ఠ స్థాయికి చేరుతోంది. బీబీఏ ప్రకారం శుక్రవారం పది గ్రాముల బంగారం (99.5 స్వచ్ఛత) రూ.21,090 ధర పలికింది. అదే 99.9 స్వచ్ఛత కల బంగారం ధర అయితే రూ.21,190 ఉంది. అంత క్రితం రోజు ధరలు వరుసగా రూ.20,980, రూ.21,080గా ఉన్నాయి. అంటే ఒక్క రోజులో రూ.110 ధర పెరిగినట్లు స్పష్టం అవుతోంది. విదేశీ మార్కెట్‌లో బంగారం ధర రికార్డు స్థాయిలో ఉంది. ఐరోపాలో స్పాట్ మార్కెట్‌లో ఔన్సు స్వర్ణం 1468.70 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజి అయిన ఎంసీఎక్స్‌లో బంగారం పది గ్రాముల జూన్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రూ.21,222 ధరను నమోదు చేసింది. ఆగస్టు కాంట్రాక్టు ధర రూ.21,520 ఉంది.

**ఎందుకిలాగంటే:** ఐరోపా దేశాల్లో ఆర్థిక సంక్షోభం ముదరడం, పశ్చిమ ఆసియాలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోవడం, డాలర్ బలహీనత .. ఇవి రజతం, కనకాల ధర రెక్కలు తొడుక్కోనేందుకు కారణం అవుతున్నట్లు నిపుణులు భాష్యం చెప్తున్నారు. 2008 తరువాత తొలిసారిగా ఐరోపా బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచుతున్నాయి. దీనివల్ల డాలర్ ఇంకా బలహీనపడుతుందన్న భావన వెండి, బంగారాల ధరలు ప్రియం అయ్యేటట్లు చేస్తోందనుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు పీపా 108 డాలర్ల వద్ద స్థిరపడింది. ఇటువంటి పరిస్థితుల్లో తమ సంపద విలువను కాపాడుకోవాలంటే వెండిపై పెట్టుబడే మార్గమని మదుపరులు ఎంచుతున్నారు. వెండి పారిశ్రామిక వినియోగం బాగా పెరుగుతోందని, ఫలితంగా డిమాండ్ హెచ్చి ధర పైపైకి దూసుకుపోతోందని వర్తకులు చెబుతున్నారు. బంగారం ధర పెరగడం వల్ల సాధారణ, మధ్యతరగతి ప్రజలు బంగారు ఆభరణాలు కొనలేక నెమ్మదిగా వెండి వైపు మొగ్గుచూపుతున్నట్లు బీబీఏ అధ్యక్షుడు సురేష్ హుండియా అభిప్రాయపడ్డారు.

**ఈ ధరలోనూ పెట్టుబడి పెట్టవచ్చా..?:** వెండి, బంగారం ధరలు శరవేగంగా పెరుగుతూ రికార్డు స్థాయి ధరలను నమోదు చేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకంలో ఆందోళన పెరిగిపోతోంది. ఈ విలువైన లోహాలు ఇక తమకు అందుబాటులో ఉండవేమోననే అనుమానం వారిలో పెరిగిపోతోంది. కొంచం అయినా ధర తగ్గితే తమకు నచ్చిన ఆభరణం కొనుగోలు చేద్దామని, లేదా భవిష్యత్తు కోసం పెట్టుబడి పెడదామని భావిస్తున్న మదుపుదార్లకు అంతకంతకూ ధర పెరిగిపోవడం మింగుడు పడటం లేదు. ఇక లాభం లేదు, కొనుగోలు చేయాల్సిందేననుకునే వారికి, ఈ స్థాయి ధరలో కొనుగోలు చేస్తే.. ధర పడిపోతుందేమోననే అనుమానం పీడిస్తోంది. నిపుణులు మాత్రం ధర పెద్దగా పడిపోయే అవకాశం లేదని, పైగా పెరిగేందుకు వీలుందని భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి ధర ఈ ఏడాదే 50 డాలర్లకు చేరవచ్చన్న అంచనా లేకపోలేదు.

### 2నెలల్లో 25% పెరిగిన ధర!

పెట్టుబడి సాధనంగా చూసే వారికి బంగారం కన్నా వెండిపై పెట్టుబడి దీర్ఘకాలంలో ఆకర్షణీయమని బులియన్ వర్తకులు అంటున్నారు. "అటు ఆభరణాలకు, ఇటు పారిశ్రామిక ఉత్పత్తికి అనుకూలమైన లోహం కాబట్టి వెండికి గిరాకీ అంతకంతకూ అధికమవుతోంది, అందువల్ల పెట్టుబడి కోణంలో వెండి అనుకూలంగా కనిపిస్తోంద"ని వివరిస్తున్నారు. గత ఏడాది కాలంలో వెండి ధర 78 శాతం పెరిగింది. కేవలం గత రెండు నెలల వ్యవధిలో వెండి ధర 25 శాతం హెచ్చింది. ఇటీవల వెండికి రిటైల్ డిమాండ్ ఎంతో పెరిగింది. 'ఒక జ్యూవెల్లరీ వర్తకుడిగా నేను వెండి, బంగారు ఆభరణాలు విక్రయించడానికి ఇష్టపడతాను, కానీ ఎక్కువ మంది వచ్చి వెండి బార్లు కావాలని అడుగుతున్నార'ని రాజధాని నగరంలోని ఆబిడ్స్‌లో ఉన్న ఓ ప్రముఖ ఆభరణాల సంస్థ యజమాని చెప్పుకొచ్చారు. తక్కువ సరఫరా, అధిక డిమాండ్‌ల వల్ల సమీప భవిష్యత్తులో వెండి ధర మండిపోతుందన్నది ఆయన అభిప్రాయం.

(వివిధ ప్రాంతాల్లో బంగారం-వెండి ధరలు 'వసుంధర' పేజీలో)



### మరింత పెరిగే అవకాశాలే ఎక్కువ

ప్రస్తుతం కిలో వెండి రూ.60,000 దాటింది. భవిష్యత్ పరిణామాలను పరిశీలిస్తే దీని ధర మరింత పెరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పారిశ్రామిక సంస్థల నుంచి గిరాకీ పెరగడం, అదే సమయంలో మదుపర్లు ఒక పెట్టుబడి సాధనంగా వెండిని ఎంచుకోవడం, ప్రపంచవ్యాప్తంగా అధిక డిమాండ్ వంటి అంశాలన్నీ వెండి ధర పెరగడానికి దోహదం చేస్తున్నాయి.

*సుకేశ్ గుప్తా, సీఎండీ, ఎంబీఎస్ జువెలర్స్*

